టీచర్ల కొరత.. విద్యార్థుల వెత

- పాఠశాల ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా లేని ఉపాధ్యాయులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- స్పందించని అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు విద్య అందడం లేదు. ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా.. పలు పాఠశాలలు ఉపాధ్యాయుడు లేకుండానే కొనసాగుతున్నాయి. మరికొన్ని ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. చిలప్‌చెడ్ మండలంలోని రాందాస్‌గూడ, ఫైజాబాద్ తండా ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయుడు లేకుండానే కొనసాగుతున్నాయి. అదేవిధంగా మండలంలో మరో ఐదు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో తరగతులు జరుగుతున్నాయి. రాందాస్‌గూడ ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులు ఉండగా, ఫైజాబాద్ తండా పాఠశాలలో 10 మంది విద్యార్థులు ఉన్నారు. రాందాస్‌గూడ పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుడు ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైర్డ్ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పాఠశాలకు ఉపాధ్యాయుడే లేడు. ఫైజాబాద్ పాఠశాల ఉపాధ్యాయుడు రెండేళ్ల కిత్రం మృతిచెందాడు. అప్పటి నుంచి ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులు వచ్చారు. ప్రస్తుతం ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడే లేడు. పాఠశాలలను సీఆర్‌పీలు నడిపిస్తున్నారు. పాఠశాల కార్యాలయ గదులు మూసి ఉంటున్నాయి. కనీసం విద్యార్థులకు ప్రార్థన చేయించేవారు లేరు.


ఉపాధ్యాయుడు లేని ఫైజాబాద్ తండా పాఠశాల

అయోమయంలో తల్లిదండ్రులు

విద్యార్థులు భవిష్యత్ ఎమవుతుందనని విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయంలో ఉన్నారు. రాందాస్‌గౌడ్ నుంచి ప్రైవేట్ పాఠశాలలలో చేర్పించేందుకు సౌకర్యాలు లేవు. ఫైజాబాద్ తండావాసులకు పిల్లలను ప్రైవేట్‌లో చదివించే ఆర్థిక పరిస్థితి లేదు. అధికారులు స్పందించి ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


రాందాస్‌గూడలో ఉపాధ్యాయులు లేక మూసి ఉన్న పాఠశాల కార్యాలయ గదులు

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి



రాందాస్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేరు. దీంతో విద్యార్థుల పరిస్థితి అర్థం కావడం లేదు. గతంలో పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రస్తుతం ఒక్కరూ కూడా లేరు. ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులు మారుతుంటే సరైన విద్య కొనసాగదు. అధికారులు పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి.

– సుదర్శన్, రాందాస్‌గూడ

ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశాం



రాందాస్‌గూడ పాఠశాలకు ప్రత్యామ్నాయంగా ఓ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశాం. ఫైజాబాద్ తండా పాఠశాల సీఆర్‌సీ నడిపిస్తున్నాడు. రెగ్యులర్ ఉపాధ్యాయులు రావాలంటే సమయం పడుతుంది. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలు ముగిశాయి. ఫలితాలు వెలువడి, నియామకాలు చేపడితేనే రెగ్యులర్ ఉపాధ్యాయులు వస్తారు.

– బుచ్యానాయక్, ఇన్‌చార్జి ఎంఈఓ

అవినీతిని నిరూపించాలి

టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ సహకార సంఘంలో అవినీతి జరిగిందని నిరూపిస్తే బహిరంగ క్షమాపణతో పాటు రైతుల సమక్షంలో రాజీనామా చేస్తానని పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. తనపై కాంగ్రెస్ నాయకులు చేసిన అవినీతి ఆరోపణలను ఖండించారు. టేక్మాల్ పాక్స్ చైర్మన్‌గా తాను పదేళ్లుగా పని చేస్తున్నానని, సొసైటీని జిల్లాలో ఆదర్శవంత సొసైటీగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. రాజకీయంగా కక్ష సాధింపు చర్యల్లోని భాగంగా తనపై కొందరు వ్యక్తులు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల సంక్షేమం కోసమే దాతలు ఇచ్చిన భూమిని వారి ఇష్ట ప్రకారమే సేల్ డీడీ చేసుకున్నట్లు.. భూమి విలువ ప్రకారమే డాక్యుమెంట్‌లో డబ్బుల వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డీసీసీబీ బ్యాంకును తీసుకొచ్చానని చెప్పారు. పెట్రోల్ బంకు నిర్మాణంలో, వరి కొనుగోలు కేంద్రాల్లో ట్రాన్స్‌పోర్ట్ ద్వారా సుతిల్ దారాలకు రూ.లక్షలు వస్తాయని వాటిని కాజేశానని ఆరోపించడం అబద్ధమని చెప్పారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, అవినీతికి పాల్పడినట్టు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఆరోపణలన్నీ రాజకీయ కక్ష సాధింపు వ్యక్తిగత కక్ష సాధింపులే ఉన్నాయని, తాను అవినీతి చేస్తే దేనికైనా సిద్ధమేనని తెలిపారు. ఇందులో సొసైటీ వైస్ చైర్మన్ మల్లయ్య, డైరెక్టర్లు కిషన్, శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు భాస్కర్, సిద్ధయ్య, చింతా రవి, గోవిందా చారి, సలీం, యాదయ్య, సాయిలు, మహేందర్, సత్యం, సలొద్దీన్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

వేలాడుతున్న విద్యుత్ వైర్లు


పొలం వద్ద వేలాడుతున్న వైర్లను కర్రతో చూపుతున్న రైతు బండప్ప

పొంచి ఉన్న ప్రమాదం

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యుత్ వైర్లు వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన రైతు గొల్ల బండప్పతో పాటు పలువురు పంట పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో పొలంలోకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కర్రతో వాటిని లేపి మరీ పొలానికి వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలం కావడంతో ప్రమాదం పొంచి ఉందని, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు మృతి


శాంతమ్మ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గుండం శాంతమ్మ (110) అనారోగ్యంతో శనివారం ఇంటి వద్ద మృతి చెందారు. శాంతమ్మకు ముగ్గురు సంతానం. శాంతమ్మ వారం రోజుల వరకు తన పనులు తానే చేసుకునేది.

◆ ఎల్‌ఓసీ అందజేత

నిజాంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో మైనంపల్లి హన్మంతరావు ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. శనివారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఆవుసుల నర్సింహచారి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతనికి మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా బాధితుడికి మైనంపల్లి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి గౌడ్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ అందజేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు


కొట్టాల అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల, మహ్మద్‌నగర్‌గేట్ తండా, పాంపల్లి తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యసిబ్బంది పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి, మందులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదాబేగం మాట్లాడుతూ.. మహిళలు రక్తహీనతను నివారించుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పాలు, కోడిగుడ్డు, ఆకుకూరలు ఆహారంలో ఎక్కువగా తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా జెండాను విజయవంతం చేయాలి


చేగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటివద్ద జాతీయ జెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీను పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా జెండా వారోత్సవాల్లో భాగంగా చేగుంటలో శనివారం అంబేడ్కర్ విగ్రహ పరిసరాలను శుభ్రం చేసి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతీ ఇంటివద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, జిల్లా నాయకులు ఎంఎల్ఎన్‌రెడ్డి, నాయకులు సాయిబాబా, నాగరాజు, సత్యం, రవి, నరేష్, నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


నర్సాపూర్‌లో పైపులైన్ పనులు పరిశీలిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డులో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ యాదగిరితో కలిసి శనివారం పరిశీలించారు. వార్డులో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇప్పటికే చేపట్టిన పైపులైన్, సీసీరోడ్డు నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని చైర్మన్ వారికి సూచించారు. పైపులైన్ పనులు పూర్తయితే నీటి సరఫరా మరింత మెరుగవుతుందని చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మహ్మద్‌నగర్‌లో గడ్డి, దోమల మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మండలంలోని మహ్మద్‌నగర్‌లో శనివారం పలు కాలనీల్లో పొదలు, మురికి కాల్వల వద్ద పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జీపీ కార్మికులు గడ్డిమందు, దోమల మందు స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్ వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ర్యాలీ

కొల్చారం(నర్సాపూర్): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం మండలంలోని ఏడుపాయల టీ జంక్షన్ నుంచి పోతంశెట్టిపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు చేపట్టే ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున హిందువులు పాల్గొని ఆ దేశంలోని హిందువులకు సంఘీభావం తెలపాలని కోరారు.

చేగుంటలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట శివారులోని బైపాస్ రోడ్డు విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు కర్నాల్‌పల్లి వ్యవసాయ బోరు బావులకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వెలగని ఎల్‌ఈడీ లైట్లు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై ఏర్పాటు చేసిన పలు ఎల్‌ఈడీ లైట్లు వెలగడం లేదు. 20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన లైట్లను డిసెంబర్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం ఇందులో కొన్ని ఎల్‌ఈడీ లైట్లు వెలగడం లేదని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన కోటి పుష్పార్చన ఉత్సవాలు


కోటి పుష్పార్చనలో భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట ఆత్మానందాశ్రమంలోని నరసింహస్వామి ఆలయంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న కోటి అర్క పుష్పార్చన ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కోటి అర్క (జిల్లేడు పూలు) పుష్పార్చనతో పాటు నాగవల్లి దళార్చన (తమలపాకులు), పంచకుండాత్మక మన్యు సూక్త యాగం, పూర్ణాహుతి, పూజలతో పాటు నిత్య అన్నదానం, సాంస్కృతిక, భక్తి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు ఆత్మానంద ఆశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకటస్వామి భక్తులకు సందేశాలు ఇచ్చారు.

ఆలయం వద్ద అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శ్రీబాల వీరహనుమాన్ ఆలయం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో బాల వీరహనుమాన్‌కు చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎస్‌ఐ

ములుగు(గజ్వేల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో కలిసి శనివారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

నర్సాపూర్: ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. యూటీఎఫ్ 50వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్సీ భవన్ ఎదుట యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై తమ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డాక్టర్ చత్రునాయక్, రవి, నాగుల్‌మీరా, తిరుపతి, వసురాం, కనకరాజు, కళా రాములు, ముకుందరావు, అప్పలనాయుడు, రవిరాజు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న యూనియన్ బాధ్యులు

చాకరిమెట్లలో శ్రావణమాస సందడి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు అభిషేకం అనంతరం సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. శివ్వంపేటకు చెందిన దివంగత సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.


సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

వైభవంగా రామలింగేశ్వర స్వామి ఊరేగింపు


చండూర్ శివారులోని మంజీరావాగు నుంచి స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): శ్రావణమాసం మొదటి శనివారం రామలింగేశ్వర స్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. మండల పరిధిలోని చండూర్ గ్రామంలో ఉన్న పురాతన ఆలయంలో వెలసిన రామలింగేశ్వరస్వామి వారికి మంజీరా నదిలో జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో స్వామివారిని భక్తిశ్రద్ధలతో ఊరేగించామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చేగుంటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


మనోహరాబాద్(తూప్రాన్): లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న హేమలత

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లోని బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. శనివారం ఎమ్మెల్యే చేగుంటకు వచ్చిన సందర్భంగా పలు గ్రామాల బాధితులు 20 మందికి మంజూరైన చెక్కులను అందజేశారు. స్థానిక సమస్యలపై ప్రత్యేక చొరవ చూపించి, ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యల గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తండ్రి సుదర్శన్ దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు డిష్‌రాజు, ఎర్ర యాదగిరి, సత్యనారాయణ, జర్నల్‌సింగ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పదిహేను మంది లబ్ధిదారులకు శనివారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలత సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యసేవలు పొందడానికి నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఆయన అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజశేఖర్‌గౌడ్, హరిశంకర్‌గౌడ్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ ఆవరణలో జెండా దిమ్మె ఏర్పాటు

తొలగించాలని బెదిరిస్తున్న పరిశ్రమ మేనేజర్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట ఎంఎస్ఎన్ పరిశ్రమ పరిసరాల్లో సీఐటీయూ హమాలీ సంఘం ఆధ్వర్యంలో జెండా దిమ్మె(గద్దె)ను ఏర్పాటు చేసేందుకు కార్మికులు పనులు నిర్వహించారు. కానీ పరిశ్రమ మేనేజర్ దాన్ని తిరస్కరించారు. పరిశ్రమలో హమాలీ పనిచేస్తున్న చందంపేట గ్రామానికి చెందిన కార్మికులు పరిశ్రమ వాల్ పక్కన జెండా దిమ్మె ఏర్పాటుకు అవసరమైన చిన్న పందిరి ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమ మేనేజర్‌తో పాటు సిబ్బంది ఆ పనులను అడ్డుకొని పోలీస్‌లకు ఫిర్యాదు చేసి, పందిరి తొలగించడంతో పాటు జెండా గద్దెను కూడా తొలగించాలని చెప్పారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు గరిగే యాదగిరి, నర్సింలు, బుర్క యాదగిరి, గణేశ్, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హమాలీ కార్మికులు

ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


నర్సంపల్లిలో ఉచిత వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది

తూప్రాన్: మండలంలోని నర్సంపల్లిలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమోహం, రక్తపోటు, మోకాళ్లు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్తి, కడుపులోమంట, మల బద్ధకం, అర్షమొలలు, దగ్గు, స్త్రీ, మూత్ర సంబంధిత వ్యాధులు తదితర సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి సీనియర్ వైద్యాధికారి రుక్సానా అన్వార్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, వైద్య సిబ్బంది జూనియర్ వైద్యాధికారి శ్రీవిద్యా, ప్రవీణ్‌కుమార్, వేంకటేశ్వర్‌గౌడ్, సురేశ్, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.